సాక్షి
నంద్యాల
సోమవారం । 25 । మార్చి । 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళా వేదికపై హైదరాబాద్‌కు చెందిన ఎస్ ఫైన్ ఆర్ట్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం భక్తులను అలరించింది.



భ్రామరీకి లక్ష కుంకుమార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి పౌర్ణమి సందర్భంగా ఆదివారం లక్ష కుంకుమార్చన పరోక్ష సేవను జరిపించారు. శ్రీశైలానికి విచ్చేయ లేని భక్తుల కోసం ఈ సేవ చేపట్టారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ పథకానికి ఆదివారం సికింద్రాబాద్‌కు చెందిన బొమ్మ కావ్యశ్రీ రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:34	ఉ॥ 4:54
ఆదోని	సా॥ 6:37	ఉ॥ 4:57
నంద్యాల	సా॥ 6:34	ఉ॥ 4:51
ఆత్మకూరు	సా॥ 6:32	ఉ॥ 4:52
బనగానపల్లె	సా॥ 6:35	ఉ॥ 4:52

హదీస్ వెలుగు :

దబ్బు ఇచ్చి వడ్డీ తీసుకోవడం మహా పాపం. ఈ హరామ్ సొమ్ముతో ఏ శుభకార్యం చేసినా అల్లాహ్ అంగీకరించరు. వడ్డీ లావాదేవీల నుంచి దూరంగా ఉండండి.

– పవిత్ర ఖురాన్

నీడలా నిఘా..!

- ఎన్నికల వేళ కట్టుదిట్టంగా కోడ్ అమలు
- మండలానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు
- మూడు విడతల్లో విధుల నిర్వహణ
- ముమ్మరంగా వాహనాల తనిఖీ
- పరిమితికి మించి బంగారం, వెండి, నగదు రవాణా నిషేధం
- రూ.50 వేలు మించితే ఆధారాలు చూపాల్సిందే
- సరైన ధ్రువపత్రాలు వెంట తప్పని సరి

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరూ కూడా కాస్త జాగ్రత్తగా ఉండాల్సిందే. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తుండటంతో నిబంధనలు తెలుసుకుని మసులుకోవాల్సిందే. ఈనెల 16వ తేదీ శనివారం కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో కోడ్ అమలులోకి వచ్చింది. ఆ రోజు నుంచే ఈ నిఘా బృందాలు రంగంలోకి దిగాయి. నంద్యాల జిల్లాలో 6 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ నిరంతరం ఊరూరా నిఘా నేత్రాలు నీడలా వెంటాడుతూనే ఉంటాయి. అణువణువునూ నిఘా బృందాలు (ఫ్లయింగ్ స్క్వాడ్‌లు) జల్లెడ పడుతున్నాయి. ఈ మేరకు మండలానికి మూడు స్క్వాడ్లు మూడు షిఫ్టుల్లో 24 గంటలూ పని చేస్తున్నాయి. నిష్పక్షపాత ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేస్తోంది. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలను తప్పకుండా పాటించాలి. లేదంటే కోరి చిక్కులు తెచ్చుకున్నట్లే అని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అంటే రాజకీయ నాయకులకే కదా మనకేం ఇబ్బందని అంతా అనుకుంటారు. కానీ కొన్నిసార్లు సామాన్యులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. తప్పు చేయకపోయినా అధికారులకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల మభ్యపెట్టేందుకు డబ్బు, మద్యం అక్రమ రవాణా, తాయిలాల పంపిణీకి అవకాశం ఉంది. వీటిని అడ్డుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా నగదు రవాణాపై ఆంక్షలు ఎక్కువగా ఉంటాయి. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేసిన సమయంలో సామాన్యులు ఎవరైనా నగదును తరలిస్తున్నప్పుడు సరైన పత్రాలు లేకపోతే ఎవరి డబ్బునైనా అధికారులు స్వాధీనం చేసుకుంటారు. నంద్యాల జిల్లాలోని 29 మండలాలు, 4 మున్సిపాలిటీలు, 519 గ్రామాల్లో నిఘా బృందాలు విస్తృతంగా పర్యటిస్తున్నాయి. మండలానికి నియమించిన మూడు బృందాలో ఒకటి రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకూ, మరొకటి మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 వరకూ, ఇంకోకటి రాత్రి 10 నుంచి మర్నాడు ఉదయం 6 వరకూ పని చేస్తున్నాయి. ఈ బృందం ఉపయోగించే వాహనానికి జీపీఎస్ అమర్చారు. ఈ బృందాలు వాహనాలను తనిఖీ చేయడంతో పాటు అక్రమ పంపిణీలు, వస్తువుల రవాణా తదితర వాటిపై ప్రజలు అందించి సమాచారం మేరకు అక్కడకు వెళ్లి పరిశీలిస్తారు. ఓటర్లకు డబ్బులు ఇవ్వడం, మద్యం పంపిణీ చేయడం తదితర వాటిపై సీ– విజిల్ యాప్లో ప్రజలే ఫిర్యాదు చేయవచ్చు.



నంద్యాల సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం



ఎన్నికల కోడ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డోన్ పోలీసులు

రూ.50 వేలు మించితే ఆధారాలు చూపాల్సిందే..

ఎన్నికల వేళ డబ్బు, మద్యం, ఇతర తాయిలాల తరలింపు, అక్రమ రవాణా, పంపిణీలను అడ్డుకునేందుకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రధాన రహదారులపై పది చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇందులో రెండు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఉన్నాయి. ఇక్కడ వాహనాల తనిఖీలు నిరంతరం చేపడుతున్నారు. ఆ సమయంలో రూ.50 వేల కన్నా ఎక్కువ నగదు పట్టుబడితే వివరణ ఇవ్వాలి. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎలా వచ్చింది? ఎక్కడికి తీసుకెళ్తున్నారు? తదితర విషయాలు చెప్పాల్సి ఉంటుంది. సమాధానంలో తేడా ఉన్నా, చెప్పిన దానికి రుజువులు చూపలేకపోయినా ఆ నగదును అధికారులు స్వాధీనం చేసుకుంటారు. సరైన ధ్రువ పత్రాలు చూపించిన తర్వాతనే నగదు తిరిగి అప్పగిస్తారు. అంతవరకు నగదు కోర్టు కస్టడీలో ఉంటుంది. ఎన్నికల కౌంటింగ్ అయ్యేంత వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. నగదు మాత్రమే కాకుండా బంగారం, వెండి తదితర ఆభరణాలు, విలువైన వస్తువులు ఏవైనా సరే అనుమానం వస్తే అధికారులు స్వాధీనం చేసుకుంటారు. బంగారం, వెండీ తదితర వర్తకులు సైతం తగిన పత్రాలు వెంట ఉంచుకునే ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. లేదంటే చిక్కులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

ఫ్లయింగ్ స్క్వాడ్ విధులు

- ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం, ఇతర వస్తువులను తరలించడాన్ని అడ్డుకోవడం.
- ఓటర్లను ప్రలోభపెట్టేలా ఉచిత భోజనాలు, ఓటర్లను అడ్డగించడం, ఆయుధాలు తదితర వాటిని అడ్డుకోవడం, సంఘ వ్యతిరేక శక్తులు గురించి ఫిర్యాదులు వచ్చిన మరుక్షణమే ఆ ప్రదేశానికి వెళ్లి విచారణ చేపట్టాలి. వీలు కాకపోతే సమాచారాన్ని తక్షణమే సమీపంలో ఉన్న సంబంధిత స్టాటిక్ సర్వే బృందానికి లేదా పోలీసు స్టేషను అందించాలి.
- నగదు, మద్యం పట్టుకున్నప్పుడు సాక్షుల సమక్షంలో పంచనామా రికార్డు చేసి, సీజ్ చేసిన తక్షణమే ఆ సమాచారాన్ని రిటర్నింగ్ అధికారి ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్‌కు తెలియజేయాలి.
- అక్రమ రవాణా వస్తువులను సీజ్ చేసినప్పుడు సదరు వ్యక్తులపై ఫిర్యాదులు చేసి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాలి.
- సీజ్ చేసే ప్రక్రియను వీడియో తీయాలి. 24 గంటల్లోగా కోర్టులో కేసును ఫైల్ చేయాలి.
- ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్ విషయాలు ప్రజలకు తెలిసేలా రిటర్నింగ్ అధికారి కార్యాలయ నోటీసు బోర్డులో ఉంచాలి.
- సీజ్ చేసిన నగదును సంబంధిత ట్రెజరీలో డిపాజిట్ చేసి, కోర్టు ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాలి.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



ఎన్నికల కమిషన్ ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఎన్నికల వేళ ముఖ్యంగా నగదు, మద్యం పంపిణీలను నివారించేందుకు నిఘా బృందాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఎవరైనా రూ.50 వేలు వరకూ నగదును తమ వెంట తీసు కువెళ్లవచ్చు. దానికి మంచితే అక్రమ రవాణాగా పరిగణిస్తారు. ఎక్కువ మొత్తంలో నగదును తరలిస్తున్నా దానికి ఆధారాలు ఉంటే పర్వాలేదు. కానీ సరైన పత్రాలు లేకుండా పరిమితికి మించి నగదు తీసుకువెళితే నిఘా బృందాలు సీజ్ చేస్తాయి. – కె.రఘువీర్‌రెడ్డి, జిల్లా ఎస్పీ, నంద్యాల

నోరు జారితే 'కేసు' పడుద్ది !

- ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను సీరియస్‌గా తీసుకుంటున్న అధికారులు
- ఇటీవల వలంటీర్లపై నోటికొచ్చినట్లు దుర్భాషలాడిన బుడ్డా
- స్పందించిన రిటర్నింగ్ అధికారి
- వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు

సాక్షి, నంద్యాల: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రతి రాజకీయ నాయకుడిపై ఎన్నికల సంఘం నిఘా ఉంచింది. ఎవరేం మాట్లాడుతున్నారు.. ఎక్కడికి వెళుతున్నారు.. ఎవరిని ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు లాంటి సమాచారాన్ని సేకరించడంతో పాటు నాయకుల కదలికలు అనుమానాస్పదంగా, మాటలు రెచ్చగొట్టేవిధంగా ఉంటే వెంటనే చర్యలకు ఉపక్రమిస్తోంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు ప్రతీ మాట ఆచితూచి మాట్లాడాల్సి ఉంది. అయితే కొంత మంది నేతలు నోటికి పని



చెబుతున్నారు. పక్కవారిపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్యను లేవనెత్తుతున్నారు.

అదుపు తప్పిన బుడ్డా

టీడీపీ శ్రీశైలం నియోజకవర్గ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి వ్యవహార శైలి తీవ్ర వివాదాస్పదమవుతోంది. ఈ నెల 19వ తేదీ ఆత్మకూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన సచివాలయ వలంటీర్లపై రెచ్చిపోయారు. వలంటీర్లు ఇంటికే పరిమితం కావాలని.. బయట కనిపిస్తే చెప్పులతో కొట్టండని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. బంధువుల ఇళ్లకు కూడా వారు వెళ్లడానికి వీల్లేదంటూ హుకుం జారీ చేశారు. బుడ్డా చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై వలంటీర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. బుడ్డా వ్యాఖ్యలతో తమకు ప్రాణహాని ఉందని వలంటీర్లు ఆత్మకూరు పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు.

స్పందించిన ఆర్ఓ

మాజీ ఎమ్మెల్యే బుడ్డా వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపాయి. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ నియోజకవర్గ ప్రజలే సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. బుడ్డా మాట్లాడిన వీడియోను జత చేశారు. మోడల్ ఆఫ్ కోడ్ కండక్ట్(ఎంసీసీ) ఉల్లంఘనపై వెంటనే స్పందించిన రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ)సుధారాణి వివరణ ఇవ్వాలని బుడ్డాకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు సమాచారం. తర్వాత ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు పోలీసులకు సైతం సూచించడంతో వారు ఇటీవల బుడ్డాపై ఐపీసీ 504, 506, సీపీసీ155(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ చర్యలతో మిగిలిన రాజకీయ నాయకులు అప్రమత్తమయ్యారు. ఇదిలా ఉంటే ఎన్నికలు ముగిసే వరకు నోటిని అదుపులో పెట్టుకోవడం ఉత్తమమని, లేకపోతే బుడ్డా పరిస్థితి ఎదురవుతుందని తెలుగుతమ్ముళ్లు సన్నిహితుల ఎదుట వాపోయినట్లు సమాచారం.

న్యూస్‌రీల్

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోస్పాడు: 2024–25 విద్యా సంవత్సరానికి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలల్లో (కేజీబీవీ) 6వ తరగతిలో, అలాగే ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 12వ తేదీ నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఏప్రిల్ 11 ఆఖరి తేదీగా నిర్ణయించారు. జిల్లాలో 27 కేజీబీవీల్లో ఒక్కొక్క పాఠశాలలో 6వ తరగతిలో 40 సీట్లను భర్తీ చేయనున్నారు. ఈ లెక్కన 1,080 సీట్లలో ప్రవేశాలు కల్పిస్తారు. అలాగే ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరానికి కూడా 1,080 సీట్లను భర్తీ చేస్తారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను సైతం భర్తీ చేస్తారు. పేద, అనాథ పిల్లలతో పాటు బడిబయట ఉన్న పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు), వలస కార్మికులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) జీవిస్తున్న బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా దరఖాస్తులు పూర్తిచేయాల్సి ఉంటుంది. సందేహాలు, సమస్యల నివృత్తి కోసం ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 18004258599, జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో హెల్ప్ లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జీసీడీఓ నాగసువర్ళల తెలిపారు.

ఇన్‌పుట్ సబ్సిడీ నివేదిక

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అన్నదాతలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపడుతోంది. ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు ఇప్పటికే ఇన్‌పుట్ సబ్సిడీని ఖాతాల్లో జమ చేసింది. తాజాగా రబీ సీజన్‌కు సంబంధించి ఇటీవల 13 కరువు మండలాలను ప్రకటించింది. వీటిలో ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, సంజామల, అవుకు, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, గోస్పాడు, నందికొట్కూరు, మిడుతూరు, దొర్నిపాడు, గడివేముల, నంద్యాల, బనగానపల్లె ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో మొత్తం 58,011 మంది రైతులు 59,207 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ రూ.57.30 కోట్లు అవసరమవుతుందని జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. శనగ 32,485, మినుము 3610, జొన్న 9981, పొగాకు 1851 హెక్టార్ల ప్రకారం పంటలు దెబ్బతిన్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాల గడువు పెంపు

నంద్యాల(న్యూటౌన్): అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత అడ్మిషన్ల దరఖాస్తుల గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం కోటా కింద పేద విద్యార్థులు ప్రవేశం పొందవచ్చన్నారు. ఆసక్తి గల వారు ese. ap. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహా మంగళహారతుల అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు జరిపారు. పల్లకీ ఊరేగింపుతో శ్రీశైల గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాళమ్మగుడి, నందిమండపం, గంగాసదనం, బయలువీరభద్రస్వామి ఆలయం, రింగ్‌రోడ్డు, సిద్ధరామప్పకొలను మీదుగా పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నందిమండపం, ఆలయ మహాద్వారం వద్దకు చేరుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన ఆలయ అధికారులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.



ఆలయ పురవీధుల్లో గిరి ప్రదక్షిణ

క్షయ వ్యాధి నివారణ సామాజిక బాధ్యత

నంద్యాల టౌన్: క్షయ వ్యాధి నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ శారదాబాయి అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినం నేపథ్యంలో ఆదివారం ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల మరింత అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ సంస్థలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆయాసం, బరువు తగ్గటం, కఫంలో రక్తం పడటం, ఛాతి నొప్పి, సాయంకాల జ్వరం, రాత్రి పూట నిద్రలో చెమటలు పట్టడం తదితర లక్షణాలు ఉంటాయని వివరించారు. గతేడాది 3,478 క్షయ కేసులు జిల్లాలో నమోదయ్యాయని, ఈ ఏడాది ఇప్పటి వరకు 551 కేసులు గుర్తించామన్నారు. ఆరు నెలల పాటు మందులు వాడితే రోగాన్ని జయించవచ్చునన్నారు. జిల్లాలో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో క్షయ నిర్ధారణ పరీక్షలకు తగిన సౌకర్యాలున్నాయన్నారు. టీబీ నివారణకు ఉత్తమ సేవలందించిన వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం క్షయ వ్యాధి కారకాలు, నివారణను వివరిస్తు ఆసుపత్రి నుంచి సాయి బాబా నగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా, ఆర్ఎంఓ నిరంజన్, డాక్టర్ ఆనీఫ్, పీఓ డాక్టర్ సునీత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రం అందజేస్తున్న డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ

'పది' స్పాట్ రెమ్యునరేషన్ భారీగా పెంపు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం విధుల్లో పాల్గొనే అన్ని కేడర్లకూ రెమ్యునరేషన్ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు పదేళ్ల తర్వాత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అన్ని కేడర్ల కంటే స్పెషల్ అసిస్టెంట్లకే రెమ్యునరేషన్ తక్కువ వచ్చేది. రోజుకు రూ.137 మాత్రమే వచ్చేది. మండుతున్న ఎండలకు తోడు ఆశించిన స్థాయిలో రెమ్యునరేషన్ ఇవ్వకపోవడంతోనే చాలా మంది టీచర్లు స్పెషల్ అసిస్టెంట్లుగా వచ్చేందుకు ఆసక్తి చూపేవారు కాదు. రోజూ 300 మంది అవసరమైతే 60 మంది కూడా వచ్చేవారు కాదు. దీంతో వీరి నియామకం అధికారులకు తల నొప్పిగా ఉండేది. ప్రతి ఏడాది స్పాట్ ప్రారంభమైనా స్పెషల్ అసిస్టెంట్ల కోసం వెంపర్లాడే పరిస్థితి ఉండేది. ఇకపై అధికారులకు ఆ ఇబ్బంది ఉండదు. ఎందుకంటే స్పెషల్ అసిస్టెంట్లకు ఆశాజనకంగా రెమ్యునరేషన్ ఉండబోతోంది. ఈ ఏడాది నుంచి రూ.300 ఇవ్వనున్నారు. అంటే దాదాపు 110 శాతం వరకు పెంచారు. చీఫ్ ఎగ్జామినర్లు (సీఈ), అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు (ఏసీఓ), డెప్యూటీ క్యాంపు ఆఫీసర్లు, క్యాంపు ఆఫీసర్ రెమ్యునరేషన్ కూడా పెరిగింది. సీఈలకు గతంలో రోజుకు రూ.264 ఇస్తుండగా దాన్ని రూ.396కు పెంచారు. ఏసీఓ (వాల్యుయేషన్)లకు రూ.286 నుంచి రూ.429కు పెరిగింది. ఏసీఓ (కోడింగ్)లకు రూ.198 నుంచి రూ.297కు పెంచారు. డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లకు రూ.330 నుంచి రూ.495 పెంచారు. క్యాంపు ఆఫీసర్లకు రూ.385 నుంచి రూ.578 పెంచారు. జిల్లాలో ఏప్రిల్ 1 నుంచి టెన్త్ స్పాట్ ప్రారంభం కానుంది. పట్టణ సమీపంలో ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోపాల్ తెలిపారు.



స్పాట్ వాల్యూయేషన్‌కు ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ అధికారులు

రమణీయం.. ఉగ్ర నరసింహుడి రథోత్సవం





భక్తజన సందోహం మధ్య రథోత్సవం (ఇన్‌సెట్) రథంలో ఉభయ దేవేరులతో కొలువైన జ్వాలనృసింహస్వామి

ఆళ్లగడ్డ: భక్తుల గోవింద నామస్మరణలు.. వేదపండితుల వేదమంత్రోచ్చారణలు.. డప్పుల వాయిద్యాల మధ్య అహోబిలేశుడి రథోత్సవం నేత్ర పర్వంగా కొనసాగింది. అహోబిలేశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదవ రోజు ఆదివారం ఎగువ అహోబిలంలో వెలసిన శ్రీజ్వాల నృసింహస్వామి రథోత్సవం కనులపండువగా సాగింది. భక్తులు భక్తి పారవశ్యంతో రథం లాగారు. భక్తుల గోవిందా నామస్మరణతో నల్లమల పులకించింది. ముందుగా నిత్యపూజల్లో భాగంగా ఉత్సవమూర్తులైన జ్వాల నృసింహస్వామి, అమ్మవార్లకు వేదపండితుల ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకించి, నవకళశ తిరుమంజనం నిర్వహించిన అనంతరం స్వామి, ఉభయదేవేరులను పట్టుపీతాంబరాలతో స్వామి అమ్మవార్లను అలంకరించారు. ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల మధ్య పల్లకీలో కొలువుంచి దేవాలయం బయట ఉన్న రథం వరకు తోడ్కొని వచ్చారు. అప్పటికే వివిధ పుష్పాలతో అలంకరించిన రథంపైకి ఉభయదేవేరులతో అహోబిలేశుడిని చేర్చారు. వేదపండితులు రథాంగ పూజలు నిర్వహించిన అనంతరం కొబ్బరికాయ సమర్పించి హారతిచ్చి రథోత్సవాన్ని ప్రారంభించారు. దేవస్థాన మాడ వీధుల్లో రథం ముందుకు కదలగా ఉగ్రనరసింహుడిని భక్తులు కనులారా దర్శించుకున్నారు.

టీడీపీ దోపిడీని ప్రజలు ఇంకా మరిచిపోలేదు

- ముస్లింల సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన

డోన్: గత టీడీపీ ప్రభుత్వం ప్రజా సేవ మాటున ప్రభుత్వ నిధులను దోచుకున్న వైనాన్ని రాష్ట్ర ప్రజలు ఇంకా మరిచిపోలేదని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. తన స్వగృహంలో ఆదివారం పట్టణానికి చెందిన 11 మసీదులకు చెందిన ముస్లిం పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముస్లింల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలు దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టలేదన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 4 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు కల్పించిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. మౌజన్లు, పేష్‌ఇమామ్‌లకు గౌరవ వేతనం ఇవ్వడంతో పాటు కుల, మత, వర్గ విబేధాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలని మంత్రి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు మంచి చేస్తుంటే టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. రెండున్నరేళ్లలో మెగా వాటర్ గ్రిడ్ పథకాన్ని పూర్తి చేస్తున్నామని, త్వరలోనే గోరుకల్లు రిజర్వాయర్ నుంచి శుద్ధజలాన్ని ప్రతి గ్రామంలో ఇంటింటికీ అందజేస్తామన్నారు. సాగు, తాగునీటికి సమస్య రాకుండా బాధ్యతగా పనిచేస్తే కమీషన్లు అంటూ నిరాధార ఆరోపణలు చేయడం తప్ప టీడీపీ నాయకులకు ఏమి చేతకాదని విమర్శించారు.

ప్రజా సేవ అంటే ఫ్యాక్షన్‌ను పోషించడం కాదు..

ప్రజలకు సేవ చేయడమంటే గూండాయిజం, రౌడీయిజం, ఫ్యాక్షనిజం పెంచి పోషించడం కాదని.. పేదలకు అన్నిరకాల మౌలిక వసతులు కల్పించడమని కేఈ, కోట్ల కుటుంబాలకు మంత్రి బుగ్గన చురకలంటించారు. దాదాపు 50 ఏళ్ల కోట్ల, కేఈ కుటుంబాలు పల్లెల్లో అభివృద్ధిని విస్మరించి ముఠా కక్షలకు అమాయకులను బలి చేశాయని విమర్శించారు. కుటుంబ యజమానులను కోల్పోయి రోడ్డున పడిన పేదలకు నేడు ఏకమైన టీడీపీ నాయకులు ఏమి సమాధానం చెబుతారని నిలదీశారు. మరమ్మతుల పేరుతో బిల్లులు తీసుకునే సంస్కృతి టీడీపీ పాలకులకే చెల్లిందన్నారు. సామాన్య పేదలు వారాంతపు సెలవు దినాల్లో టెన్నిస్, క్రికెట్, స్విమ్మింగ్ లాంటి క్రీడల్లో పాల్గొనకూడదా అన్నారు. పేదలు కుటుంబ సమేతంగా నగరవనం లాంటి ప్రకృతి ఒడిలో సేదతీరడం టీడీపీ నాయకులకు నచ్చడం లేదన్నారు. పేద ప్రజల కోసం క్లబ్, హోటల్, జిమ్, ఫంక్షన్‌హాల్, కల్యాణ మండపాలు, ఆసుపత్రులు, కళాశాలలు, విద్యార్థుల వసతి గృహాలు, ఉపాధి శిక్షణ కేంద్రాల్లాంటివి అభివృద్ధి పనులు కావా ఎద్దేవా చేశారు. సమావేశంలో ముస్లిం మతపెద్దలు అక్బర్‌బాషా, అబ్దుల్లా, చిన్న చాంద్, కాశీం, లార్క్ మాబు, సయ్యద్ బాషా, హాజీసాహెబ్, మౌళాలి,పెద్ద చాంద్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి బొకే అందజేస్తున్న ముస్లిం మత పెద్దలు

క్లుప్తంగా

27న బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి జూనియర్స్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భానుప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు అర్హులని, వెంట ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని పేర్కొన్నారు. వివరాలకు 79891 73121 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఐలమ్మ పేరిట 'రజక' కార్యాలయం



సమావేశంలో మాట్లాడుతున్న సి.గురుశేఖర్

కర్నూలు(సెంట్రల్): వీరనారి ఐలమ్మ పేరుతో కర్నూలులో రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యాలయం నిర్మించామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన కార్మిక, కర్షక భవన్‌లో మాట్లాడుతూ..దాతల సాయంతో ఐలమ్మ పేరిట భవన నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ఈ నెల 27వ తేదీన దానిని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రారంభోత్సవంలో జిల్లాలోని రజక వృత్తిదారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శేషాద్రి, రాముడు, శ్రీనివాసులు, జయమ్మ పాల్గొన్నారు.

విరిగిపడిన రథమండపం షట్టర్ భాగం



విరిగిపడిన షట్టర్ డోర్ భాగం

మహానంది: క్షేత్రంలోని రథశాల మండపానికి ఏర్పాటు చేసిన షట్టర్ భాగం కొంత విరిగి పడింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. 16 రోజుల పండుగ అనంతరం శనివారం రథమండపం వద్ద ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు విశేష పూజలు జరిపి రథాన్ని రథశాలలోకి చేర్చారు. సాయంత్రం షట్టర్ మూసేటప్పుడు తుప్పు పట్టిన కొంత భాగం విరిగిపడింది. అదృష్టవశాత్తు సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

అనుమతులు లేకుండానే ఎన్నికల ప్రచారం!

కర్నూలు సిటీ: తెలుగు దేశం పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 16వ తేదిన దేశ వ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. ఆ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. నియోజకవర్గంలోని కర్నూలు రూరల్ మండలంలోని శివరాంపురం, ఆర్.కొంతలపాడుతో పాటు మరి కొన్ని గ్రామాలు, కోడుమూరు మండలం అమడగుంట్ల గ్రామంలోను, గూడూరు మండలంలోని జూలకల్లు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి ఏ రోజు ఏ గ్రామంలో చేస్తున్నారు? ఎన్ని వాహనాల్లో వెళ్లుతున్నారో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అనుమతులు తీసుకోవాలి. కానీ టీడీపీ అభ్యర్థి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని సమాచారం.

నవ్విపోదురు గాక మాకేంటి సిగ్గు!

తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, కేంద్ర రైల్వే శాఖ మాజీ సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో రౌడీషీటర్లు, చీటింగ్ కేసులో ముద్దాయిలు, మహిళలను మోసగించిన చీటర్లు, భూకబ్జాదారులతో పాటు అక్రమ మద్యం రవాణా, విక్రయదారులు కూడా పాల్గొంటుండటంతో ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వీరందరిపై నియోజకవర్గంలోని పలు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. వీరిని వెంట పెట్టుకుని టీడీపీ అభ్యర్థి తన ప్రచారంలో 'ప్రజా స్వామ్యాన్ని కాపాడుతాం.. మహిళలకు రక్షణ కల్పిస్తాం.. భూ అక్రమణలను అడ్డుకుంటాం.. శాంతిభద్రతలను పరిరక్షిస్తాం' అంటూ ఉపన్యాసాలు ఇస్తుండటం చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. – డోన్



టీడీపీలో కొనసాగుతున్న కన్నపకుంట గ్రామానికి చెందిన దేశాయి విష్ణువర్ధన్‌రెడ్డి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి ఫ్లెక్సీలను ఎత్తుకెళ్లిన కేసుతో పాటు ఫ్లెక్సీని చించివేసిన కేసులో నిందితునిగా ఉన్నారు.



ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి ప్యాపిలి మండల కేంద్రానికి చెందిన బోరెడ్డి అభిలాష్‌రెడ్డి. ఇప్పటివరకు నాలుగు అక్రమ మద్యం రవాణా కేసుల్లో ప్రధాన నిందితుడు. డోన్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌తో పాటు బేతంచెర్ల, ప్యాపిలి ఎక్సైజ్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. పలు వాహనాలను కూడా ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. గత ఏడాది నారా లోకేష్ యువగళం పాదయాత్ర, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు డోన్ నియోజకవర్గ పర్యటన సందర్భంగా విచ్చలవిడిగా కర్ణాటక మద్యాన్ని అక్రమంగా విక్రయించినట్లు ఎక్సైజ్ పోలీసులు ధ్రువీకరించారు.



టీడీపీ అభ్యర్థి కోట్ల ప్రచారంలో కనిపిస్తున్న ఈ వ్యక్తి ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన కుమ్మరి సుధాకర్. అదే గ్రామానికి చెందిన 614 సర్వే నంబర్‌లోని 8.84 ఎకరాల పీర్ల మాన్యం భూమిని అక్రమంగా రిజిస్టర్ చేసుకొని ఇతరులకు విక్రయించడం ద్వారా లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకున్న కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్నారు.



చిత్రంలో నారా లోకేష్‌తో ఉన్న యువకుడి పేరు ఉమాయిన్. డోన్ కొండపేటకు చెందిన ఈ యువకుడు వివిధ రాష్ట్రాల్లో అపహరించిన సెల్ ఫోన్లను తక్కువ ధరకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. ఇతనిపై 2017 నుంచి ఇప్పటి వరకు 5 కేసులు నమోదయ్యాయి.

ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం అవసరం

- 'మన సీమ కథలు' పుస్తకావిష్కరణలో వక్తలు



మాట్లాడుతున్న గోరటి వెంకన్న

కర్నూలు కల్చరల్: రాయలసీమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, కరువు తీరిపోవాలని.. ఇవన్నీ జరగాలంటే ప్రత్యేక రాలయసీమ రాష్ట్రం అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ప్రముఖ రచయిత బండి నారాయణ స్వామి రచించిన 'మన సీమ కథలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. గాయకులు, రచయిత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, రచయితలు కలం ప్రహ్లాద, కానాపురం కృష్ణారెడ్డి తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న మాట్లాడుతూ మన సీమ కథలు పుస్తకంలో రాయలసీమలోని అన్ని సమస్యలు కళ్లకు కట్టినట్లు బండి నారాయణ స్వామి పొందుపరిచారన్నారు. వాస్తవికతకు చాలా దగ్గరగా కథా వస్తువు ఉందన్నారు. రాయలసీమ సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం ఉంటుందన్నారు. త్వరలో రాయలసీమ కరువు తీరుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మారుతి, రాయలసీమ ఉద్యమం సంఘాల నాయకులు రవికుమార్, సీమకృష్ణ, అభ్యుదయ రచయితల సంఘం సభ్యులు సయ్యద్ జహీర్ అహ్మద్, పెరికల రంగస్వామి, ప్రమోద్ చక్రవర్తి, రాజా రమేష్, రాణి లీలావతి, చంద్రమౌళిని తదితరులు పాల్గొన్నారు.

నగదు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకోండి

బొమ్మలసత్రం: జిల్లా, అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం గంజాయిలపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లాలోని పోలీస్ అధికారులకు ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆదివారం జిల్లాలోని పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పోలీసులశాఖ అనుమతి లేనిదే ఎటువంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఊరేగింపు కార్యక్రమాలు జరగకుండా చూడాలని సూచించారు. ఎన్నిలక నిబంధనలకు లోబడి మాత్రమే ప్రచార వాహనాలకు అమర్చే లౌడ్ స్పీకర్ల శబ్దాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని వివరించారు. ఒక ప్రాంతాన్ని, కులాన్ని, వర్గాలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తే ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ఎంతటివారైనా ఎన్నికల కోడ్ ఉల్లఘింస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ డీఎస్పీ సంతోష్, నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లాలోని పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బైకులు ఢీకొని ఇద్దరు మృతి



ప్రమాదంలో కుప్పకూలిన రాజేష్, సుధీర్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులోని అయ్యలూరుమెట్ట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. మసీదుపురం గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి నంద్యాల మండలం పోలూరు గ్రామంలో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. ప్రసాద్‌రెడ్డి స్థానిక ఎస్వీరెడ్డి మహిళా కళాశాలలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం కళాశాల సెలవు కావటంతో అదే కళాశాలలో అటెండర్‌గా పని చేస్తున్న తన స్నేహితుడు బాలనాగయ్యతో కలిసి బైక్‌పై తన సొంత గ్రామమైన మసీదుపురం బయలుదేరాడు. అదే క్రమంలో పట్టణానికి చెందిన రాజేష్ పట్టణంలోని ఒక ప్రైవేటు బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రాజేష్ తన స్నేహితుడు సుధీర్‌తో కలిసి ఆళ్లగడ్డలో జరిగిన వివాహ వేడుకలకు హాజరై బైక్‌పై నంద్యాలకు బయలుదేరారు. రెండు బైక్‌లు అయ్యలూరు మెట్ట వద్ద ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్ నడుపుతున్న ప్రసాద్‌రెడ్డి, మరో బైక్ నడిపే రాజేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ప్రసాద్‌రెడ్డి బైక్‌పై వెనుక కూర్చున్న బాలనాగయ్యకు ఎటువంటి గాయాలు కాలేదు. రాజేష్ బైక్‌లో వెనుక కూర్చున్న సుధీర్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితులను స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రసాద్‌రెడ్డి, రాజేష్‌లు మృతి చెందగా సుధీర్ పరిస్థితి విషమంగా ఉండటంతో బంధువులు మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చురుగ్గా ఇంటర్ మూల్యాంకనం

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం చురుగ్గా సాగుతోంది. మూల్యాంకనానికి హాజరుకావాలని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. అయితే అధ్యాపకులకు స్పాట్ వాల్యూయేషన్‌కు పంపించలేమని కార్పొరేట్, సెమీ కార్పొరేట్ కాలేజీల ప్రిన్సిపాళ్లు బోర్డు అధికారులకు తెలియజేశారు. దీంతో ఈ విషయం బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకోవడంతో 132 మంది అధ్యాపకులకు నాలుగు రోజుల క్రితం షోకాజ్ నోటీసులు ఇచ్చారు. నోటీసులు అందుకున్న వారిలో 90 శాతం మంది మూల్యాంకనం క్యాంపులో రిపోర్ట్ చేసుకున్నారు. దీంతో మూల్యాంకన ప్రక్రియ వేగం పుంజుకుంది.

రూ.లక్ష జరిమానా వసూలు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం ఎదురూరు గ్రామంలో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలించిన కేసులో రెండు టిప్పర్లకు విధించిన రూ.లక్ష జరిమానాను వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎదురూరు గ్రామంలోని సర్వే నంబర్ 126లో అక్రమంగా గ్రావెల్‌ను తవ్వి తరలించిన కేసులో రెండు టిప్పర్లను అదుపులోకి తీసుకుని సీజ్ చేశామన్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ.50వేల చొప్పున జరిమానా విధించి, వసూలు చేశామన్నారు.

మున్సిపల్ ఉద్యోగులకు షోకాజ్ నోటీసు

నంద్యాల(సిటీ): పన్ను వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 14 మంది మున్సిపల్ ఉద్యోగులకు మున్సిపల్ కమిషనర్ నిరంజ్‌రెడ్డి ఆదివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 2023–24వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గృహాలు, ఖాళీ స్థలాలు, నీటి పన్నుల వసూళ్లు చేయాలని మున్సిపల్ ఉద్యోగులను కమిషనర్ ఆదేశించారు. విధులలో అలసత్వం వహించిన జూనియర్ అసిస్టెంట్‌లు శ్రీనివాసులు, పి.దేవరాజు, యుగంధర్, సీనియర్ అసిస్టెంట్‌లు వరముద్దిలేటి, సోహైల్ అహ్మద్, సురేఖ, లక్ష్మిప్రసన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ షేక్ రిజ్వాన, ఏఈ అబ్దుల్ రావూఫ్, మనోహర్‌రెడ్డి, రికార్డ్ అసిస్టెంట్ ఆంజనేయవరప్రసాద్, ఏఎస్ఓ వాణిశ్రీ, మీటర్ రీడర్ ఎమ్‌వీ రమణలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

వృద్ధురాలి అదృశ్యం



లక్ష్మమ్మ (ఫైల్)

ఆదోనిరూరల్: మండలంలోని బైచిగేరి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనే 70 సంవత్సరాలు వయస్సు ఉన్న వృద్ధురాలు అదృశ్యమైనట్లు బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వృద్ధురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ ఎర్రిస్వామి ఆదివారం విలేకరులకు తెలిపారు.

సాంకేతికతపై రైతులకు అవగాహన పెంచాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాఘవేంద్ర

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన పెంచాలని నంద్యాల ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త కే.రాఘవేంద్ర తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమ కోర్సుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంచేందుకు అనేక యాప్‌లు ఉన్నాయన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో ప్రభుత్వం కష్టమ్ హయ్యరింగ్ సెంటరు ఏర్పాటు చేసిందన్నారు. డిజిటల్ పద్ధతిలో అందుబాటులో ఉన్న విషయాలను తెలుసుకొని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రిటైర్డ్ జేడీఏ, దేశీ డిప్లొమా కోర్సు సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ... రైతులు ప్రతి అవసరానికి ఇన్‌పుట్ డీలర్లనే ఆశ్రయిస్తారని, వారికి చక్కటి సలహాలు ఇచ్చి సహకరించాలన్నారు.

ఐజయ్యను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



మాజీ ఎమ్మెల్యే ఐజయ్యతో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, రామసుబ్బారెడ్డి

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఐజయ్య, ఆయన తనయుడు చంద్రమౌళిని మర్యాద పూర్వకంగా శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ రామసుబ్బారెడ్డి కలిశారు. నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వైఎస్సార్‌సీపీ డాక్టర్ దార సుధీర్ విజయం కోసం కృషి చేయాలని వారు కోరారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా..

- ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు
- ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు, మృతిచెందిన రవీంద్రనాథ్‌రెడ్డి

పాములపాడు: కర్నూలు – గుంటూరు రహదారిపై ఆదివారం పాములపాడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా అతని కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు నగరం సోమప్ప నగర్ కాలనీకి చెందిన రవీంద్రనాథ్ రెడ్డి (37) తన తండ్రి రామతిమ్మారెడ్డి, తల్లి రామకృష్ణమ్మ, భార్య సింధుజా, కూతుర్లు లోహితా రెడ్డి, చైత్రారెడ్డితో కలిసి కారులో శ్రీశైలం బయల్దేరారు. పాములపాడు వద్ద కర్నూలు– గుంటూరు ప్రధాన రహదారిలో ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేశాడు. ఆ సమయంలో ఎదురుగా కాకినాడ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను గమనించక పోవడంతో ఢీ కొన్నాడు. అదే సమయంలో కారు కుడి వైపు టైరు పగిలి మట్టి కట్టకు తగిలి కారు నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవీంద్రానాథ్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ అశోక్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన సింధుజ, చైత్రారెడ్డిని 108లో ఆత్మకూరుకు తరలించగా, రామ తిమ్మారెడ్డి, లోహితారెడ్డి, రామక్రిష్ణమ్మను ఆటోలో పాములపాడు పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. రవీంద్రనాథ్‌రెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. మృతుడి భార్య సింధుజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు

కర్నూలు(అర్బన్): సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన చైతన్యరాయులు, డాక్యుమెంట్ రైటర్ మున్నాపై నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తనకు పెద్దల నుంచి సంక్రమించిన ఇంటిని ఇతరులకు అక్రమంగా రిజిస్టర్ చేశారని నగరంలోని చిత్తారివీధికి చెందిన మహమ్మద్ ఉజైర్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చేపట్టిన విచారణలో చైతన్యరాయలు సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో ఈ రిజిస్ట్రేషన్ జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. మహమ్మద్ ఉజైర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సబ్ రిజిస్ట్రార్ చైతన్యరాయలు, డాక్యుమెంట్ రైటర్ మున్నా, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఇద్దరిపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్నికల ఏర్పాట్లు చకచకా

- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి
- ఇప్పటికే డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల గుర్తింపు
- ఎన్నికల విధులపై పీఓ, ఏపీఓలకు శిక్షణకు చర్యలు
- మార్చి 30, ఏప్రిల్ 1న నిర్వహణకు ప్రణాళిక



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు అన్ని రకాల ఏర్పాట్లను ఎన్నికల సంఘం ముందస్తుగా చేస్తోంది. ఇప్పటికే జిల్లాలోని 2,186 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించి ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వికలాంగులు, అనారోగ్యంతో బాధపడే వారు సులభంగా వెళ్లేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి రన్నింగ్ వాటర్‌తో కలిపి మరుగుదొడ్లు, తాగడానికి మంచినీటి సదుపాయాలు కల్పించారు. మరుగుదొడ్లు ఏర్పాటుకు వీలు లేని పాఠశాలల్లో మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఎన్నికల నిర్వహణ కోసం డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలతో పాటు స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తారు. అక్కడి నుంచి ఎన్నికల సామగ్రిని తీసుకొని ఉద్యోగులు పోలింగ్ కేంద్రాలను వెళ్తారు. ఇందుకోసం అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను గుర్తించారు. కర్నూలు అసెంబ్లీకి సంబంధించి అవుట్‌డోర్ స్టేడియం, కోడుమూరుకు సంబంధించి సిల్వర్ జూబ్లీ కాలేజీ, పాణ్యంకు సంబంధించి జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, ఎమ్మిగనూరుకు సంబంధించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మంత్రాలయానికి సంబంధించి పరిమళ విద్యాకేతన్ ఉన్నత పాఠశాలలో, ఆదోనికి సంబంధించి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, ఆలూరుకు సంబంధించి ఆలూరు జూనియర్ కాలేజీ, పత్తికొండకు సంబంధించి పత్తికొండ జూనియర్ కాలేజీలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. అందులో భాగంగా ఇప్పటికే ఆయాకేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఎన్నికలు ముగిసిన తరువాత ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలను నేరుగా రిసెప్షన్ సెంటర్లకు అత్యంత బందోబస్తు మధ్య తీసుకెళ్లి రిసెప్షన్ సెంటర్లలో అప్పగించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి ఈవీఎంలు, వీవీ ప్యాట్లలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్ర పరుస్తారు. ఈ క్రమంలో అన్ని నియోజకవర్గాలకు సంబంధించి రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్‌లను రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేశారు. అన్ని నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలను కూడా ఆర్‌యూలోనే ఏర్పాటు చేశారు.

పోలింగ్ అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ

ఏపీలో ఎన్నికలు మే 13న జరగనున్న నేపథ్యంలో పోలింగ్‌లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు జిల్లా ఎన్నికల సంఘం ప్రణాళికలు రూపొందిస్తుంది. పోలింగ్ విధుల్లో అతి ముఖ్యమైన ప్రీసైడింగ్ ఆఫీసర్(పీఓ), అసిస్టెంట్ ప్రీసైడింగ్ ఆఫీసర్లకు (ఏపీఓ) ఎన్నికల విధుల నిర్వహణపై మార్చి 30వ తేదీ, ఏప్రిల్ ఒకటో తేదీన శిక్షణ ఇవ్వనుంది. కర్నూలు నగరంలోని సుంకేశుల రోడ్డులో ఉన్న ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాలులో నిర్వహించే ఈ శిక్షణలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల నుంచి మొత్తం 5,357 మంది పాల్గొంటారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా శిక్షణ తేదీలు, సమయం ఇలా..

అసెంబ్లీ నియోజకవర్గం	పీఓలు,ఏపీఓల సంఖ్య	శిక్షణ తేదీ	సమయం
మంత్రాలయం	646	మార్చి 30	ఉదయం 9 నుంచి 1 గంట వరకు
ఆలూరు	765	మార్చి 30	ఉదయం 9 నుంచి 1 గంట వరకు
ఎమ్మిగనూరు	680	మార్చి30	మధ్యాహ్నం 2 నుంచి 6 గంటలు
పత్తికొండ	676	మార్చి 30	మధ్యాహ్నం 2 నుంచి 6 గంటలు
కోడుమూరు	827	ఏప్రిల్ 1	ఉదయం 9 నుంచి 1 గంట వరకు
ఆదోని	454	ఏప్రిల్ 1	ఉదయం 9 నుంచి 1 గంట వరకు
కర్నూలు	898	ఏప్రిల్ 1	మధ్యాహ్నం 2 నుంచి 6 గంటలు
పాణ్యం	411	ఏప్రిల్ 1	మధ్యాహ్నం 2 నుంచి 6 గంటలు